క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు, నియోజకవర్గ కార్యదర్శి అభి డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్సీ బాలికల వసతి గృహాన్ని వారు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రహరీ గోడ లేకపోవడంతో హాస్టల్లోకి పందులు, కుక్కలు వస్తున్నాయని వారి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అధికారులు హాస్టల్లోని సమస్యలను పరిష్కరించాలని నేతలు డిమాండ్ చేశారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం


సరుకులు పంపిణీ చేస్తున్న మత పెద్దలు

శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయమని ముస్లిం మత గురువు జనాబ్ ముఫ్తి నహీం సాహెబ్ అన్నారు. పట్టణంలోని నగరి వీధిలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు నెల నిత్యావసర సరుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వర రావు, గరికపాటి రమేష్‌బాబు, కంతా ఉదయ్, సంస్థ సభ్యులు బాబా ఫరీద్, లాంకో షరీఫ్, కలాం పాల్గొన్నారు.

టిప్పర్ల తాకిడితో రోడ్లు ధ్వంసం


కో–ఆర్డినేటర్ శంకర్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న కారిపాకం గ్రామస్తులు

వరదయ్యపాళెం: మండలంలోని వితయ్యపాళెం, పులివల్లం ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలిపోతున్న గ్రావెల్ అక్రమ రవాణా లారీల తాకిడికి కారిపాకం రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతోందని కారిపాకం గ్రామస్తులు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం కారిపాకంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో గ్రావెల్ అక్రమ రవాణా గురించి, ధ్వంసమవుతున్న రోడ్ల గురించి గ్రామస్తులు ప్రశ్నించి నాయకులను నిలదీశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, యుగంధర్‌రెడ్డి, నాయకులు నరసరాజు, బాలరాజు, కృష్ణమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఆదివారం శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాఢ మాసం దినిష్టా నక్షత్రం రోజున విశ్వ బ్రాహ్మణ సంఘం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. తొలుత విఘ్నేశ్వరపూజ, పతాకావిష్కరణ, హోమం, విశ్వకర్మ మహాయోగం, మహాపూర్ణాహుతి అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి వారసులలో ఏడవ తరానికి చెందిన వీరంభట్లయ్య, ఉమాగౌరి దంపతుల చేతుల మీదుగా కల్యాణోత్సవం పండితుల వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల హోరు, భక్తుల సందడి నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మూతపడుతున్న గ్రంథాలయాలు

- గ్రంథాలయాల నిర్వహణ అధ్వాన్నం
- వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగలో తాళం
- పట్టించుకోని పాలనా యంత్రాంగం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో విజ్ఞాన బాంఢాగారాలైన గ్రంథాలయాలు వరుసగా మూత పడుతున్నాయి. వాటి నిర్వహణ అధ్వాన్నంగా మారుతోంది. రోజురోజుకు గ్రంథాలయాలు పాఠకులకు దూరమవుతున్నాయి. సొంత భవనాలు, అధికారులు లేక తాళాలతో దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా కార్యకలాపాలు నడపాల్సిన ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామస్థాయిలో సైతం డిజిటల్ గ్రంథాలయాలను అందుబాటులోకి తెచ్చింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కనీసం శాఖ గ్రంథాలయాల నిర్వహణ కూడా ప్రశ్నార్థకం అవుతోంది. ఎన్నో ఏళ్లగా ఉన్న గ్రంథాలయాల సేవలు నామమాత్రంగా మారాయి. ప్రధానంగా యువతకు ఉపయోగపడే పోటీ పరీక్షల పుస్తకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ఆ మేరకు సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 6 గ్రంథాలయాలు గతంలో ఉండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 4కు చేరింది. ఈ 4 గ్రంథాలయాలకు కూడా అధికారులు లేక ఇన్‌చార్జ్‌ల పాలనలో మొక్కుబడిగా కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోని సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, వరదయ్యపాళెం, బీఎస్‌కండ్రిగ మండలాల్లో 4వేలకు పైగా పాఠకులు సభ్యత్వం తీసుకున్నారు. ఇంత ఆదరణ కలిగిన గ్రంథాలయాల వ్యవస్థ నేడు మసకబారుతోంది.

ఇన్‌చార్జి పాలనలో గ్రేడ్–2 గ్రంథాలయం

నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో ఉన్న గ్రేడ్–2 గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కరువయ్యారు. దీంతో నాగలాపురం గ్రంథాలయానికి చెందిన గ్రేడ్–3 గ్రంథాలయ అధికారి ప్రస్తుతం ఇన్‌చార్జ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆయన వారంలో 2 రోజులు మాత్రమే హాజరవుతారు.





బీఎన్ కండ్రిగలో మూతపడిన గ్రంథాలయం, వరదయ్యపాళెంలో అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవనం

మిగిలిన రోజులు స్వీపర్ పర్యవేక్షణలో గ్రంథాలయం కొనసాగుతోంది. ఈ గ్రంథాలయంలో వెయ్యి మందికి పైగా సభ్యత్వం తీసుకున్నారు. రోజువారీ వందకు పైగా పాఠకులు గ్రంథాలయాన్ని సందర్శించి పత్రికలు, పుస్తకాలు చదువుకుంటారు. ఇక్కడ పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులో లేవు. పూర్తిస్థాయి వసతులు లేక నామమాత్రంగా మారింది.

పాఠకులకు దూరం

నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎస్‌కండ్రిగ గ్రంథాలయాలు మూతపడ్డాయి. ఏడేళ్ల క్రితం వరదయ్యపాళెం గ్రేడ్–3 గ్రంథాలయం మూతపడగా నాలుగేళ్ల క్రితం బీఎస్‌కండ్రిగ గ్రేడ్–3 గ్రంథాలయం మూతపడింది. ఈ రెండు గ్రంథాలయాలకు సంబంధించి 1200 మందికి పైగా పాఠకులు సభ్యత్వం కలిగిఉన్నారు. అయితే ఇక్కడ పనిచేస్తున్న అధికారులు ఉద్యోగ విరమణ పొందడంతో వారి స్థానంలో గ్రంథాలయ అధికారులు నియమించకపోవడంతో పూర్తిగా పాఠకులకు దూరం చేస్తూ మూతవేశారు.

ఇన్‌ఛార్జ్ పాలనలో పిచ్చాటూరు

నియోజకవర్గంలోని పిచ్చాటూరు మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయం ఇన్‌ఛార్జ్ అధికారి పర్యవేక్షణలో మొక్కుబడిగా కొనసాగుతోంది. నారాయణవనం గ్రేడ్–3 గ్రంథాలయ అధికారి పిచ్చాటూరు గ్రంథాలయానికి ఇన్‌చార్జ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ వారంలో ఒక్కరోజు మాత్రమే విధులకు హాజరవుతారు. మిగిలిన రోజుల్లో స్వీపర్ ద్వారా కొనసాగించే పరిస్థితి.

వరదయ్యపాళెంలో నూతన భవనం నిర్మాణం:

వరదయ్యపాళెంలో ఏడేళ్ల క్రితం గ్రేడ్–3 శాఖ గ్రంథాలయం మూతపడింది. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రంథాలయ నూతన భవనానికి రూ.25 లక్షలు మంజూరు చేసింది. పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులను ప్రారంభించి శ్లాబు దశకు పూర్తి చేశాడు. పనులు ఇంకా పూర్తి కావల్సి ఉంది.


నాగలాపురం గ్రంథాలయంలో పాఠకులు, ఇన్‌చార్జ్ అధికారి పర్యవేక్షణలో గ్రేడ్–2 శాఖ గ్రంథాలయం



సన్మానం


సన్మానిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి: బలిజలకు గతంలో రిజర్వేషన్ కల్పించి తరువాత రద్దు చేశారని తిరిగి పునరుద్ధరించాలని తలంపుతో చిత్తూరు నుంచి అమరావతికి పాదయాత్రగా బయలుదేరిన సాన ప్రసాద్‌ను ఆదివారం శ్రీకాళహస్తిలోని నగరివీధిలో కాపు నేతలు సత్కరించారు. సిద్దులు గారి ప్రసాద్, అంజూరు శ్రీనివాసులు, ఉప్పు కష్టయ్య, పూల కృష్టయ్య, పసుపులేటి నవీన్‌కుమార్, సుబ్బారావు, రిటైర్డ్ ఏఎస్ఐ ప్రసాద్, భాస్కర్ ,పగడాల సుధాకర్, నరేంద్రబాబు, పేట జన, పసుపులేటి కోదండరామయ్య, శ్రీపురం సుధాకర్పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిఘా


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

రేణిగుంట: అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని అర్బన్ సీఐ జయచంద్ర అన్నారు. రేణిగుంట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లకు సీఐ జయచంద్ర కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు, అనుమానితులు వారానికి ఒకసారి స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. సక్రమమైన పద్ధతిలో జీవనం సాగించాలని బెదిరింపులు రౌడీయిజానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీట్ ఉన్నవాళ్లు అసాంఘిక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

రాయుడు హత్య దారుణం

శ్రీకాళహస్తి: మండలంలోని బొక్కసంపాలెంకు చెందిన శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్య దారుణమని శ్రీకాళహస్తీశ్వర ఆలయ మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన రాయుడు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియచేశారు. అంజూరు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో ఇటువంటి హత్యా రాజకీయాలు ఎప్పుడూ లేదన్నారు. ఈ హత్యపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలన్నారు. జనసేన కార్యకర్త హత్యకు గురికావడంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపించాల్సిన బాధ్యత పవన్‌కల్యాణ్ తీసుకోవాలన్నారు. కాపు సంఘ నేతలు దండి రాఘవయ్య, సాధన మున్నా రాయల్, జయశ్యామ్ రాయల్, సూర సురేష్ రాయల్, పెరుమాళ్ చౌదరి, బుగ్గ హరిరాయల్, రామచంద్రారెడ్డి, మైనార్టీ నేతలు పఠాన్ ఫరీద్, గోరా, ఫజల్ నివాళులర్పించారు.

జ్యుడిషియల్ విచారణ జరపాలి

శ్రీకాళహస్తి: కోట వినుత కారు మాజీ డ్రైవర్ సీహెచ్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్యకు గురైన ఘటనపై జ్యుడిషియల్ విచారణ జరపాలని భారత కమ్యూనిస్టు పార్టీ శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాయుడు హత్యకు బలమైన రాజకీయ కారణాలు ఉండొచ్చని గురవయ్య తెలిపారు. 2019 నుంచి ఎంతో నమ్మకంగా వారి వద్ద ఉన్న రాయుడును జనసేన నేతలు ఎందుకు హత్య చేశారో శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. నిజాలను విచారణ అధికారులు తేల్చాలని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని గురవయ్య డిమాండ్ చేశారు.


నివాళులర్పిస్తున్న అంజూరు

ఉద్యోగాల పేరిట రూ.85 లక్షలు దండుకున్నారు!

- మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

తిరుపతి కల్చరల్: ఉద్యోగాల పేరిట డబ్బులు దండుకుని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని తిరుపతికి చెందిన బాధితులు ఉమాపతి, ఖాజా విజ్ఞప్తి చేశారు. తిరుపతి ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో పని చేసే జూనియర్ అసిస్టెంట్ హారిక రెవెన్యూ విభాగంలో బ్యాక్‌లాగ్ పోస్టులు తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇస్తామని నమ్మబలికారని ఆరోపించారు. ఆమె బంధువులతో కలిసి వ్యూహం ప్రకారం ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించారని, అనంతరం ఉద్యోగాలు పొందాలంటే రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల చొప్పున 14 మంది నిరుద్యోగుల నుంచి రూ.85 లక్షలు వసూలు చేసి ఉద్యోగాలు తీసిచ్చిన పాపాన పోలేదన్నారు. దీనిపై ప్రశ్నిస్తే దిక్కున్న చోటుకు వెళ్లి చెప్పుకోండని బెదిరింపులకు పాల్పడుతోందని తెలిపారు. దీనిపై జిల్లా ఎస్పీని కలిసి తమ గోడు నివేదించామని, ఇప్పటివరకు స్పందించలేదని, ఇకనైనా తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆ జ్ఞాపకం.. అపూర్వం


ఆత్మీయ సమ్మేళనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981–82లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. దీనికి సైన్స్ ఉపాధ్యాయులు రామ్మూర్తి, సోషియల్ టీచర్ కృష్ణమాచారి హాజరయ్యారు. బాల్య జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనుభవాలను, అనుభూతులను పంచుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుమాంజలి, ఉమామహేశ్వర్, హిమ కుమార్, జనార్దన్, సోమశేఖర్, రవి పాల్గొన్నారు

కండలేరులో 30.316 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 30.316 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2050, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 15, మొదటిబ్రాంచ్ కాలువకు 65 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.


దుస్తుల పంపిణీ


విద్యార్థినులకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఆశ్రమ మేనేజర్ అమరనాథరెడ్డి

ఏర్పేడు: స్థానిక ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ వ్యాసాశ్రమంలోని వెంకటేశ్వరా కల్యా గురుకుల పాఠశాలలో చదువుతున్న 435 మంది విద్యార్థినులకు ఆదివారం ఉచితంగా దుస్తులు(పంజాబీ డ్రెస్సులు)ను ఆదివారం ఆశ్రమ మేనేజర్ మన్నెం అమరనాథ రెడ్డి పంపిణీ చేశారు. ఆశ్రమంలోని అధిష్టాన మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులకు పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతోపాటు చదువుల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన కోరారు.



బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులను అనుగ్రహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి వేంచేపు చేసి, వైఖానస ఆగమోక్తంగా దేవేరుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవను చేపట్టారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు తన దేవేరులతో కలసి వాహన మండపం వద్దకు వేంచేపు చేశారు. బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వాహనం.. ట్రాఫిక్ జామ్


భారీ ట్రాలీపై అతిపెద్ద ట్యాంకర్

దొరవారిసత్రం: భారీ వాహనంతో జాతీయ రహదారిపై అడుగడుగునా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెన్నైలోని హార్బర్‌కు వచ్చిన అతి పొడవైన ఎత్తైన ట్యాంకర్‌ను 192 చక్రాలు కలిగిన 155 అడుగుల పొడవు ఉన్న ట్రాలీ లారీపై ఉంచి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టుకు బయల్దేరింది. మండలంలోని తల్లంపాడు గ్రామ సమీపంలో టోల్‌ప్లాజా వద్ద అనుమతిలేక మూడు రోజుల పాటు ఆగిపోయి ఉన్న ఈ భారీ వాహనం ఆదివారం దొరవారిసత్రం దాటింది. ఈ వాహనానికి వెనుక ముందు భాగంలో ఉన్న 20 మంది పలు చోట్ల రహదారి పైనుంచి వెళ్లే విద్యుత్ తీగలను పైకి ఎత్తి పట్టుకుంటూ వాహనాన్ని ముందుకు నడిపించారు. ఈ సమయంలో దొరవారిసత్రం కుప్పారెడ్డిపాళెం, పోలిరెడ్డిపాళెం, నెలబల్లి తదితర ప్రాంతాల్లో చెన్నై నుంచి నెల్లూరు వైపునకు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఆర్టీఐ జిల్లా కార్యదర్శిగా జాకబ్



వెదురుకుప్పం: ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కార్యదర్శిగా మండలంలోని బలిజమొండి వెంగనపల్లె గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కొత్తపల్లె జాకబ్‌ను నియమించినట్లు ఆ శాఖ జాతీయ అధ్యక్షుడు చంద్రమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం నరసరావుపేటలో జరిగిన సమావేశంలో వెల్లడించినట్లు తెలిపారు. పలువురు అభినందించారు.

నాగేంద్ర హారాయ.. త్రిలోచనాయ


భరతనాట్యం అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుపతికి చెందిన శ్రీనాట్యాలయ బృందం ఆధ్వర్యంలో భరతనాట్యం ప్రదర్శించారు. ఇందులో భాగంగా వక్రతుండ మహాకాయ అంటూ సాగిన పాటతో మొదలై వివిధ పాటలకు కళాకారులు భవిశ, ధామిని, రోషిణి, ఇషిప్రియ, కీర్తన, తనుశ్రీ, రమ్య చూడచక్కని హావభావాలతో నాట్య ప్రదర్శన ఇచ్చారు. వారి అభినయానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం ఇన్‌చార్జ్ ఏఓ సూర్యతేజ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

నిరుపయోగంగా నీటి తొట్టెలు





ఏర్పేడులో నిరుపయోగంగా నీటి తొట్టెలు, రాజులపాళెంలో ఖాళీ నీటి తొట్టెలు

ఏర్పేడు: పశువుల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా పల్లెపండుగ పశువుల నీటి తొట్టెలను ఉపాధి నిధులతో నిర్మించారు. అయితే వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో లక్ష్యం నీరుగారడంతోపాటు రూ.లక్షల నిధులు నిరుపయోగమయ్యాయి. ఏర్పేడు మండలంలో ఉపాధి పథకం కింద 30 పశువుల నీటి తొట్టెలను రూ.11లక్షల 52వేల నిధులు వెచ్చించి నిర్మించారు. అయితే వాటిలో చాలాచోట్ల నీటిని నింపకపోవడంతో అవి నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల నీటితో నింపినా, అక్కడ చిన్నారులు జలకాలాడుతూ ఉన్నారే తప్ప పశువులు దాహార్తి తీర్చుకున్న పరిస్థితులు లేవు. టీడీపీ నేతల జేబు ఖర్చులకు ఈ పథకం పెట్టి రాష్ట్ర వ్యాప్తంగా రూ.కోట్లు నిధులు వృథా చేశారని విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


మృతుల కుటుంబీకులను పరామర్శిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదివారం మండలంలోని వికృతమాల గ్రామంలో ఎల్లప్పరెడ్డి, పెనుమల్లం గ్రామంలో ప్రసాద్ కుమార్, రావిళ్లవారికండ్రిగ గ్రామంలో మునికృష్ణమ్మ కుటుంబీకులను పరామర్శించారు. వారు ఇటీవల మృతిచెందడంతో వారి ఇళ్లకు వెళ్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబసభ్యులను ఓదార్చి అండగా ఉంటామన్నారు. నివాళులర్పించిన వారిలో ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, బిల్లు రామబత్తయ్య, గరాటరెడ్డి, మునికృష్ణారెడ్డి, రాజారెడ్డి, గోపి, సుధాకర్ యాదవ్, రామమూర్తి, మునిరత్నంరెడ్డి, శ్రీధర్, కేశవులు రెడ్డి, రమేష్, దామురెడ్డి, రాజా, జగదీష్, గిరి, సురేష్, వినోద్, సూరి తదితరులు పాల్గొన్నారు.